
సాక్షి ఒడిశా

శనివారం । 9 । నవంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.9,66,480లు, బంగారం 1.780 గ్రాములు వెండి 66 గ్రాముల 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



విజ్ఞాన మేళాకు స్పందన

జయపురంలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. 118 ప్రాజెక్టులు ప్రదర్శించారు.

- 8లో



గజపతి జిల్లాలో కామధేను..

గజపతి జిల్లాలో కామధేను యోజన ప్రారంభించనున్నారు. ఈ మేరకు మంత్రి ప్రకటించారు.

- 8లో

ఆకలి చావులపై.. సర్కారుకు తాఖీదులు

- రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరణ కోరిన ఓహెచ్ఆర్సీ
- డిసెంబర్ 20లోగా వివరణ ఇవ్వాలని హుకుం



భువనేశ్వర్: కంధమల్ జిల్లాలో మామిడి బద్దల జావ తాగి ఇద్దరు మహిళలు మృతి చెందిన సంఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఓహెచ్ఆర్సీ రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరణ కోరింది. ఈ మేరకు రాష్ట్ర ఆహార, పౌర సరఫరా శాఖ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శులు, కంధమల్ కలెక్టరు నుంచి వివరణ కోరుతూ తాఖీదులు జారీ చేసింది. డిసెంబరు నెల 20వ తేదీ లోగా వివరణ దాఖలు చేయాలని తాఖీదుల్లో పేర్కొంది.

కంధమల్ జిల్లా దారింగిబాడి మండలం గొదాపూర్ పంచాయితీ మండిపొంకా గ్రామంలో మామిడి బద్దలు, బియ్యంతో కలిపి ఉడికించిన జావ తాగి పలువురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అక్టోబరు 30వ తేదీన ఈ విచారకర సంఘటన చోటు చేసుకుంది. ఈ సంఘటనలో ఇద్దరు మహిళలు మృతి చెందారు. మరో ఆరుగురు అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమించడంతో కటక్ ఎస్సీబీ వైద్య బోధన ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. మిగిలిన వారు బరంపురం ఎంకేసీజీ ఆస్పత్రిలో చికిత్స పొందారు. రున్ని మాఝి (30), రమిత పట్నామాఝి (28) మృతులుగా గుర్తించారు. అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలైన వారిలో ప్రభాతి మాఝి (32), సుసనా మాఝి (35), జిత్తా మాఝి (30), డ్రెంగాలు పట్నామాఝి (55) మరియు టున్ని మాఝి (45) ఉన్నారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా కొనసాగుతుంది.

ఈ విచారకర సంఘటనపై విచారణ చేపట్టి పటిష్టమైన చర్యలకు ఆదేశాలు జారీ చేయాలనే అభ్యర్థనతో పలువురు మానవ హక్కుల ప్రతినిధులకు ఫిర్యాదు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో ఒడిశా మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర ప్రభుత్వం వివరణ కోరుతు తాఖీదులు జారీ చేసింది. మరో వైపు ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశించింది. మామిడి బద్దల జావ ఆరగింపుతో తలెత్తిన మృత్యు సంఘటనపై సంబంధిత శాఖల నివేదిక వివరాలు సమగ్రంగా దాఖలు చేయాలని కమిషను ఆదేశించింది.

జాతీయ ఆహార భద్రత చట్టం కింద గత 3 నెలలుగా తిండి గింజల రేషను నిలిపి వేయడంతో ఈ విచారకర పరిస్థితి తాండవించిందని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. తినేందుకు బియ్యం కొరవడడంతో ఆకలి తీర్చుకునేందుకు మామిడి బద్దల్ని ఆశ్రయించాల్సి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా నిండు ప్రాణాలు కోల్పోయినట్లు వివరించారు.

విషపూరితం

మామిడి బద్దలతో వండిన జావ నిల్వ చేయడంతో విషపూరితమైంది. హైడ్రోజన్ సల్ఫైడ్ హెచ్2 ఎస్ చేరడంతో ఈ పరిస్థితి సంభవించినట్లు ప్రయోగ శాల పరీక్షల్లో తేలింది. ఈ సంఘటనపై రెవెన్యూ డివిజినల్ కమిషనరు ఆర్డీసీ దర్యాప్తు చేయాలని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు ఆర్డీసీ రూపా రోషన్ సాహు, కంధమల్ కలెక్టరు అమృత్ రుతురాజ్ సమక్షంలో విచారణ ప్రారంభించారు. బుధవారం ఆమె మండిపొంకా గ్రామం సందర్శించి ఈ సంఘటనలో మృతి చెందిన మహిళల కుటుంబీకులతో సంప్రదింపులు జరిపారు. మరోమారు ఈ నెల 11వ తేదీన ఆర్డీసీ ఈ ప్రాంతం సందర్శించి ప్రభావిత వ్యక్తులతో ప్రత్యక్షంగా సంప్రదించనున్నారు.

కళాశాల విద్యార్థినిపై గ్యాంగ్‌రేప్



వివరాలు వెల్లడిస్తున్న కటక్ నగర డీసీపీ జగ్‌మోహన్ మీనా

భువనేశ్వర్: కటక్ మహా నగరంలో దారుణం చోటుచేసుకుంది. కళాశాల విద్యార్థినిపై ఆరుగురు సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారని కటక్ నగర డీసీపీ జగ్‌మోహన్ మీనా శుక్రవారం విలేకర్లకు వెల్లడించారు. బాధితురాలి ప్రియుడే తోటి మిత్రులతో కలిసి ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు ప్రకటించారు. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా నిందితులందరినీ అరెస్టు చేసిన కోర్టులో ప్రవేశ పెట్టామని చెప్పారు. వీరిలో ఒకరు మైనరుగా గుర్తించామన్నారు. జోన్ – 6 ఏసీపీ స్వస్తిక్ పండా ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం బాదంబాడి, పూరీ ఘాట్ ఠాణాల ఇనస్పెక్టరు ఇన్‌చార్జిలు సంయుక్తంగా దాడులు నిర్వహించి నిందితుల్ని అరెస్టు చేసినట్లు డీసీపీ వివరించారు. మరోవైపు, సామూహిక అత్యాచార వీడియో క్లిప్పింగ్ ప్రసారం పట్ల కఠిన చర్యలు చేపడుతున్నట్లు డీసీపీ ప్రకటించారు. నిందితుల అధీనంలో ఉన్న వీడియో చిత్రీకరణ స్వాధీనపరచుకున్నామని, ఈ వీడియో ప్రసారం పొందిన ఇతరుల మొబైలు ఫోన్లు సైతం జప్తు చేసినట్లు పేర్కొన్నారు. ఈ వీడియోనే నెట్‌లో పెడతామని బెదిరించి రెండు సార్లు నిందితులు సామూహికంగా అత్యాచారం చేసినట్లు తెలిసిందన్నారు.

పుట్టిన రోజు వేడుకతో వేధింపు..

బాధిత యువతి పుట్టిన రోజు సందర్భంగా స్థానిక కేఫేలో తన మిత్రులతో కలిసి విందు ఏర్పాటు చేసి అభ్యంతరకర వీడియోల్ని రహస్యంగా చిత్రీకరించి తదుపరి దశలో అందరికీ ప్రసారం చేస్తామని బెదిరించి వేధింపులకు గురి చేశారని డీసీపీ తెలిపారు. యువతి ప్రియుడు కేఫే యజమాని సహకారంతో అభ్యంతరకర వీడియో చిత్రీకరించాడని చెప్పారు. దీని ఆధారంగా ఆమెని బ్లాక్‌మెయిల్ చేసి అంచెలంచెలుగా సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని తెలిపారు.

న్యూస్‌రీల్

విద్యా సంస్థలకు త్వరలో పట్టాల పంపిణీ



పూజారి, రెవెన్యు మంత్రి సురేష్ కుమార్

భువనేశ్వర్: రాష్ట్ర విద్యా సంస్థల ఆధీనంలో ఉన్న స్థలాలకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయనుంది. పట్టాల మంజూరు ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేయాలనే సంకల్పంతో విభాగం కృషి చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సురేష్ కుమార్ పూజారి మీడియాకు తెలిపారు. డిసెంబరు 30 సరికి రాష్ట్రంలో పాఠశాలలు, కళాశాలలకు స్థల మంజూరి పట్టాలు జారీ చేయడం జరుగుతుందని మంత్రి వివరించారు. ఈ మేరకు అనుబంధ కార్యాచరణ చురుగ్గా కొనసాగిస్తున్నారు. 20 రెవెన్యూ గ్రామాల నుంచి విద్యా సంస్థలకు స్థల కేటాయింపు పట్టాలు మంజూరు చేయాలని ప్రతిపాదన విభాగానికి చేరినట్లు మంత్రి తెలిపారు. స్థలాల పట్టాల మంజూరు పురస్కరించుకుని విద్యా సంస్థల గణన ఆరంభమైంది.

గోవుల అక్రమ రవాణా



గోవుల అక్రమ రవాణా

భువనేశ్వర్: మయూర్‌భంజ్ జిల్లాలో గోవుల అక్రమ రవాణా గుట్టు రట్టయ్యింది. ఈ చర్యకు పాల్పడుతున్నట్లు సందేహించి 11 మందిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. 2 సరుకు రవాణా వాహనాల్లో మొత్తం 150 గోవుల్ని అక్రమంగా తరలిస్తున్నట్లు స్థానికులు గుర్తించారు. ఆనందపూర్ ప్రాంతం కోడపడా, కాలేజ్ ఛక్ ప్రాంతంలో గోవుల్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాల్ని స్థానికులు అడ్డుకున్నారు. ఈ సమాచారం ఆధారంగా ఆనందపూర్ ఠాణా పోలీసులు ఘటనా స్థలం చేరి గోవుల అక్రమంగా తరలిస్తున్న నిందితుల్ని అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. పోలీసుల పర్యవేక్షణలో గోవులు సురక్షితంగా ఉన్నాయి.

కోడి పందాల అడ్డాపై పోలీసుల దాడులు



కోడి పందాలలో అరెస్టు చేసిన వ్యక్తులు, సీజ్ చేసిన బైక్‌లు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ సమితి కమర-పొర్లి గ్రామాల మధ్య బహిరంగ ప్రదేశంలో జరుగుతున్న కోడి పందాలపై శుక్రవారం బొరిగుమ్మ పోలీసులు దాడులు నిర్వహించినట్లు పోలీసు అధికారి రొచిత మడకామి వెల్లడించారు. బొరిగుమ్మ సబ్‌డివిజన్ పోలీసు అధికారి తపశ్విణి కుహార్ ఆదేశం ప్రకారం పోలీసులు జరిపిన దాడిలో 23 బైక్‌లు, 2 ఆటోలు జప్తు చేశామని వెల్లడించారు. కోడి పందాల్లో పాల్గొన్న 9 మందిని అరెస్టు చేశామని చెప్పారు. వారిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

వలకు చిక్కిన మొసలి



మొసలిని పట్టుకున్న అటవీ శాఖ సిబ్బంది

భువనేశ్వర్: అటవీ శాఖ సిబ్బంది నిర్విరామ ప్రయత్నంలో మొసలి వలలో చిక్కుకుంది. గురు వారం మధ్యాహ్నం చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుని దృష్టిలో మొసలి పడింది. ఈ విషయం అటవీ శాఖ అధికారులకు తెలియజేయడంతో రంగంలోకి దిగి అర్ధరాత్రి వరకు నిర్విరామంగా శ్రమించి వలలో చేజిక్కించుకున్నారు. ఈ సంఘటన బాలాసోర్ జిల్లా భొగొరాయ్ మండలం బిచిత్రపూర్ తీరంలో చోటుచేసుకుంది. తీరంలో మొసలి ఉన్నట్టు మత్స్యకారుడు గుర్తించి అటవీ సిబ్బందికి తెలియజేశాడు. దీంతో 15 మంది అటవీ సిబ్బంది వలవేసి ఎనిమిది అడుగుల మొసలిని నిర్బంధించారు. భిత్తరకనికా అభయారణ్యం మడ అడవుల తీరంలో సురక్షితంగా దాన్ని విడిచి పెట్టారు.

కొరాపుట్ పర్వ్ 2024కు సన్నద్ధం



కొరాపుట్ పర్వ్ 2024 సన్నాహక సమావేశంలో సబ్ కలెక్టర్, చైర్మన్ తదితరులు

జయపురం: మున్సిపాలిటీ స్థాయిలో కొరాపుట్ పర్వ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు శుక్రవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ కౌన్సిల్ సభాగృహంలో శుక్రవారం సాయంత్రం జరిగిన సమావేశానికి చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి అధ్యక్షత వహించారు. ఈ నెల 21న మున్సిపాలిటీ స్థాయి పర్వ్ నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది ఆ రోజు మా భగవతీ మందిరం నుంచి పర్వ్ ఊరేగింపు ప్రారంభమై దసరా పాడియాకు చేరుకున్న తర్వాత పర్వ్ పతాకం ఎగర వేయాలని నిర్ణయించారు. 23వ తేదీ వరకు వివిధ పోటీలు నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో జయపురం సబ్ కలెక్టర్ ఎ.శొశ్యా రెడ్డి, వైస్ చైర్మన్ శ్రీమతి బి.సునీత, కార్యనిర్వాహక అధికారి పితబాస్ సాహు, పర్వ్ కార్యక్రమంపై చర్చించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను ధిరెన్ పట్నాయిక్, నిరంజన్ పాణిగ్రాహి, శంకర ప్రహరాజ్‌లకు అప్పగించారు. ఆటల బాధ్యతలను జయపురం సబ్‌డివిజన్ అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి రబి నాయిక్, వై.ప్రసాద్, భవానీ పండ, జహన్ హరిజన్ లకు అప్పగించారు.

రాజవీధి రోడ్డు పనులు ప్రారంభం



రెండురోజులుగా పురపాలక శాఖ వేస్తున్న తారు రోడ్డు



రాత్రి వేళ పర్లాకిమిడి రాజవీధి తారు రోడ్డు పనులు

పర్లాకిమిడి: నాలుగేళ్ల అనంతరం పర్లాకిమిడి రాజవీధి (బోడో దోండో) రోడ్డు పనులను పురపాలక శాఖ ఆధ్వర్యంలో గురువారం నుంచి పనులు మొదలుపెట్టారు. ప్రస్తుతం రాత్రిపూట తారు రోడ్డు పనులు చేపట్టడంతో ట్రాఫిక్ నిలుపుదల చేశారు. కటక్ కాంట్రాక్టర్ పి.యం.ఆర్.కన్‌స్ట్రక్షన్స్ తారు రోడ్డు పనులు చేజిక్కించుకున్నది. హాట్ మిక్స్ యంత్రాలతో 80 మీటర్ల రోడ్డు వేసిన తర్వాత యంత్రం మొరాయించడంతో పనులు సగంలో ఆగిపోయినట్టు మున్సిపల్ శాఖ ఇంజీనరు జుధిష్టర బెహేరా తెలియజేశారు. ప్యాలస్ నుంచి హైస్కూల్ జంక్షన్ వరకూ పనులు రెండురోజుల్లో పూర్తిచేస్తామని మున్సిపల్ ఈఓ గౌరచంద్ర పట్నాయిక్ తెలియజేశారు.

ఎన్‌సీసీ అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ

భువనేశ్వర్: మావోయిజం అణచివేత ప్రయత్నంలో యంత్రాంగం సరికొత్త పంథా ఎన్నుకుంది. విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కల్పించి మావోయిజం అణచివేతలో చేయూతగా వినియోగించే యోచనతో అడుగులు వేస్తుంది. ఈ నేపథ్యంలో నేషనల్ కేడెట్ కాప్స్ ఎన్‌సీసీ విద్యార్థులకు మావోయిజం అణచివేత పట్ల ప్రత్యేక శిక్షణ కలిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మావో ప్రభావిత జిల్లాల్లో కళాశాల స్థాయి ఎన్‌సీసీ అభ్యర్థులకు ఈ శిక్షణ కల్పిస్తారు. తొలి విడత కింద 7 జిల్లా ప్రధాన కార్యాలయాల్లో ఈ కార్యక్రమం చేపడతారు. ఈ జాబితాలో కలహండి, కంధమల్, బొలంగీరు, మల్కన్‌గిరి, నవరంగపూర్, నువాపడా, రాయగడ జిల్లాలు ఉన్నాయి.

నిరుపేదలకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న నిర్వాహకురాలు

రాయగడ: స్థానిక రైతుల కాలనీలో గల నవజీవన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం 40 మంది నిరుపేద మహిళలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ప్రతి నెల ఈ ట్రస్ట్ ద్వారా పేదలకు బియ్యం, పప్పు, నూనె, దుంపలు వంటి పది రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్నట్లు నిర్వాహకురాలు ఎం.నళిని తెలియజేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్ ఆచార్య గత కొన్నాళ్లుగా ఇక్కడ ఈ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి పేదలకు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని చెప్పారు.

పుణ్య క్షేత్రాలకు బస్సు సేవలు

- మంత్రి బిభూతి భూషణ్ జెనా

భువనేశ్వర్: దేశ వ్యాప్తంగా ప్రముఖ పుణ్య క్షేత్రాల దర్శనాలకు వెళ్లే భక్తుల కోసం బస్సు సేవలను అందుబాటులోకి తీసుకురావాలేనే యోచన రాష్ట్ర ప్రభుత్వం ఉంది. అందుకుతగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తోంది. అన్ని వర్గాల ప్రజలకు అనుకూలించే రీతిలో సరసమైన ధరలతో బస్సు సౌలభ్యం కల్పించనున్నట్లు రాష్ట్ర రవాణా, వాణిజ్య శాఖ మంత్రి బిభూతి భూషణ్ జెనా శుక్రవారం వెల్లడించారు. పూరీ, అయోధ్య, తిరుపతి వంటి ప్రముఖ పుణ్య క్షేత్రాలకు ఉన్నత శ్రేణి బస్సు సేవల్ని సరసమైన ధరలకు అందుబాటులోకి తేనున్నారు. కొత్త ఆంగ్ల సంవత్సరాదికి ముందుగానే ఈ సౌకర్యం ప్రవేశ పెట్టనున్నట్లు మంత్రి వివరించారు. ఈ మేరకు పెద్ద సంఖ్యలో బస్సులు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రముఖ పుణ్య క్షేత్రాలకు రాకపోకలు చేసేందుకు రవాణా సంబంధిత అనుమతుల మంజూరు పూర్తయింది. బస్సులు అందుబాటులో ఉన్నందున అతి త్వరలో పుణ్య క్షేత్రాల దర్శన ప్రక్రియను ప్రారంభించనున్నారు.

పలు రాయితీలు

బస్సులో తీర్థ యాత్రల కోసం ప్రభుత్వం పలు రాయితీలు కల్పిస్తుంది. ప్రధానంగా మహిళల కోసం ప్రత్యేక రాయితీలతో బస్సు సౌకర్యం అందుబాటులోకి వస్తుందని మంత్రి తెలిపారు. ఈ విధానం అమలు చేయడం ద్వారా రాష్ట్రంలో రోడ్డు రవాణా వ్యవస్థను బలోపేతం చేసే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది.

ముక్తికి మార్గం.. సత్సంగం



రమేష్, నాగరాజులను సన్మానిస్తున్న దృశ్యం

రాయగడ: సత్సంగం ముక్తికి మార్గమని శ్రీకాకుళం జిల్లా ఉర్లాం అగ్రహారానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు బంకుపల్లె రమేష్ శర్మ అన్నారు. స్థానిక రైతుల కాలనీ నాగరిక్ మంచ్ సంస్థ రెండు రోజుల పాటుగా కార్తీక మాస విశిష్టత అనే అంశంపై ఏర్పాటు చేసిన ప్రవచన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. గురువారం రాత్రి జరిగిన కార్యక్రమంలో కార్తీక స్నానం దీప దానం, గోదానం వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఉత్కళ ఆంధ్ర బ్రాహ్మణ సేవా సమాజం అధ్యక్షులు, ప్రముఖ వేద పండితులు రేజేటి శ్రీనివాస్ శర్మ, కార్యదర్శి భళ్లమూడి నాగరాజు అతిథులుగా హాజరై ప్రసంగించారు.

గంజాయి అక్రమ రవాణా గుట్టురట్టు

- వ్యక్తి అరెస్టు
- ఏడు కిలోల గంజాయి స్వాధీనం

రాయగడ: గంజాయి అక్రమ రవాణా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఈ ఘటనలో ఒకరిని అరెస్టు చేసి అతని నుంచి ఏడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రాయగడకు పొరుగున ఉన్న కందమాల్ జిల్లా బలిగుడ నుంచి అక్రమంగా గంజాయిని తరలిస్తుండగా రాయగడ రైల్వే స్టేషన్‌లో ఈ సంఘటన చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు శుక్రవారం తెలియజేసిన వివరాల ప్రకారం.. కందమాల్ నుంచి శేఖ్ కమీలుద్దీన్ అనే యువకుడు బస్సులో రాయగడకు వచ్చాడు. అక్కడ నుంచి స్థానిక రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. ఈ క్రమంలో రైల్వే పోలీసులు ఎప్పటిలాగే తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో కోల్‌కత్తా వెళ్లే రైలు సమలేశ్వరి కోసం ప్లాట్‌ఫారం వద్ద శేఖ్ కమీలుద్దీన్ వేచిఉండడాన్ని గమనించిన పోలీసులు అనుమానించి అతని బ్యాగును తనిఖీ చేయగా అందులో ఏడు కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో అతన్ని అదుపులోకి తీసుకొని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్టు అనంతరం కోర్టులో హాజరు పరిచారు.

రేషన్ డిపోకు తాళం



డిపో వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

రాయగడ: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో గల 21వ వార్డుకు చెందిన అంబాగుడలో గల ప్రభుత్వ రేషన్ డిపోకు ఆ ప్రాంత ప్రజలు తాళం వేశారు. గత కొద్ది నెలలుగా ఈ డిపోలో తమకు ప్రభుత్వం అందిస్తున్న ఏ ఒక్క నిత్యావసర వస్తువు సరిగ్గా అందడం లేదని, డిపో సేల్స్ మెన్ ఖుర్షీద్ ఖాన్ సరిగ్గా డిపో తెరవడం లేదని వారంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కడ్రక సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారులతో మాట్లాడారు. అక్కడకు చేరుకున్న ఏసీఎస్ఓ సుధాంశు భోయ్ పరిస్థితిని సమీక్షించి ఆందోళన చేసిన వారితో చర్చించారు. సరుకులు అందడం లేదని లబ్ధిదారులు చెప్పగా.. తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆందోళనకారులకు 21వ వార్డు కౌన్సిలర్ రాజీవ్ కొసల మద్దతు ప్రకటించారు.

ఏనుగుల అలజడి



పంట పొలాల్ని ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు

మయూర్‌భంజ్ జిల్లా బొడొదెవులి గ్రామం శివార్లలో ఏనుగుల గుంపు అలజడి రేపింది. పంట పొలాల్ని ధ్వంసం చేసి గ్రామం వైపు చొరబడుతుండగా గ్రామస్తులు అప్రమత్తమయ్యారు. ఈ గుంపులో 28 ఏనుగులు ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. విషయాన్ని అటవీ శాఖ అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లారు. ఏనుగుల గుంపుని దూరంగా అడవుల వైపు తరలించాలని అభ్యర్థించారు. నదీ తీరం దాటి గ్రామం పొలిమేరల్లో ఈ గుంపు సంచరిస్తున్నట్లు గ్రామస్తుల సమాచారం. ఈ గుంపు కెంజొహర్ నుంచి మయూర్‌భంజ్ వైపు కదులుతోంది. – భువనేశ్వర్

క్లుప్తంగా

సంప్రదాయబద్ధంగా చాట్ పూజలు



చాట్ పూజల్లో బిహారీలు

జయపురం: జయపురంలో నివాసముంటున్న బీహార్‌తోపాటు ఇతర రాష్ట్ర ప్రజలు గురువారం సాయంత్రం సంప్రదాయబద్ధంగా చాట్ పూజలను ఉత్సాహంగా జరుపుకున్నారు. స్థానిక ఖజురీబంద్ ఘాట్ వద్ద జరిగిన ఈ ఉత్సవంలో 500 మందికి పైగా మహిళలు, పిల్లలు, పురుషులు పాల్గొన్నారు. ఖజురీ బంద్‌లో అభ్యంఘణ స్నానాలు చేసి రాత్రంతా పూజలు నిర్వహించిన భక్తులు శుక్రవారం ఉదయం సూర్య నమస్కారాలు చేశారు.

వైట్‌స్టోన్ అక్రమ రవాణా అడ్డగింత



పట్టుబడిన నిందితులతో అటవీ అధికారులు



ట్రక్‌లో లోడ్ చేసిన వైట్‌స్టోన్

మల్కన్‌గిరి : కలిమెల సమితి మోటుపుసు గూడెం అటవీ ప్రాంతంలో వైట్‌స్టోన్(క్వార్జ్) అక్రమ రవాణాను అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. 40టన్నులను ఆంధ్రాకు తరలిస్తుండగా దాడులు నిర్వహించారు. 2 ట్రక్కులు, జేసీబీ, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు నిందితులు కె.నరసింహారావు, బొర్రా కనకనాగ సత్యనారాయణ, ముద్దంగుల సందీప్, యర్రా పవన్‌కుమార్, కోనేరు శ్రీనివాసరావు, సత్యేందర్‌కుమార్‌లను అరెస్టు చేశారు. వీరిలో మొదటి ఐదుగురు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని అటవీ అధికారులు తెలిపారు.

జిల్లాకు ఇద్దరు డీఎస్పీలు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకు ఇద్దరు డీఎస్పీలను బదిలీపై పోస్టింగ్ ఇస్తున్నట్లు మంగళగిరి డీజీపీ కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు అందాయి. వెయిటింగ్ డీఎస్పీగా ఉన్న జి.సీతారామారావును శ్రీకాకుళం స్పెషల్‌బ్రాంచి డీఎస్పీగాను, విజయవాడ సీఎస్‌బీ-2 డీఎస్పీగా ఉన్న వీవీ అప్పారావును కాశీబుగ్గ డీఎస్పీగా నియమిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాశీబుగ్గ డీఎస్పీగా ఇదివరకు పనిచేసిన పాత్రిని శ్రీనివాసరావుకు ఉద్యోగోన్నతి లభించి అడిషనల్ ఎస్పీ(క్రైమ్)గా శ్రీకాకుళంలోనే నియమితులయ్యారు. అయినప్పటికీ కొంతకాలంగా కాశీబుగ్గకు డీఎస్పీ లేకపోవడంతో ఇన్‌చార్జి బాధ్యతలు చూస్తున్నారు. ఎన్నికల వరకు జిల్లా స్పెషల్‌బ్రాంచిలో డీఎస్పీగా పనిచేసిన ఎ.త్రినాథరావు అనంతరం బదిలీపై వెళ్లడంతో ఇక్కడ కొన్నాళ్లు ఆ పోస్టు ఖాళీగానే ఉండిపోయింది. ఇప్పుడు కొత్త డీఎస్పీ సీతారామారావు వస్తుండటంతో ఆ లోటు తీరినట్లే.

రహదారి భద్రతే.. జీవితానికి రక్షణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: రహదారుల భద్రతే.. జీవితాలకు రక్షణగా నిలుస్తాయని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతా చర్యల ఆంక్షలను మరింత కఠినతరం చేయాలని ఆదేశించారు. శ్రీకాకుళం నగరం నుంచి నరసన్నపేట వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు తమ్మినాయుడుపేట వైపు రాంగ్ రూట్ లో వెళ్లి జాతీయ రహదారి పైకి వెళ్లరాదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఆర్టీసీ బస్సులపైనా ఇకపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్లు, 158 సున్నితమైన ప్రాంతాల్లో రక్షణ చర్యలపై చర్చించారు.



విద్యార్థినులకు సూచనలిస్తున్న వ్యవసాయ విశ్రాంత అధికారి జి.వెంకట రెడ్డి



సోలార్ ప్రాజెక్టుతో లైట్లను వెలిగించే ప్రాజెక్టు

విజ్ఞాన మేళాకు విశేష స్పందన

జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆలోచింపజేసింది. వివిధ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరై 118 ప్రాజెక్టులను ప్రదర్శించారు. జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రాజెక్టుల వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ విశ్రాంత అధికారి జి.వెంకటరెడ్డి, హెచ్‌ఎం ప్రకాశ్‌చంద్ర పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

- జయపురం



వ్యర్థ వస్తువులతో అందమైన ప్రాజెక్టు



భూకంపం, ప్రకృతి వైపరీత్యాల ప్రాజెక్టు



ఇన్‌సెక్ట్ కిల్లింగ్ డస్ట్‌బిన్



వేస్ట్ మేనేజమెంట్ ప్రాజెక్టు

గోపాల్‌పూర్ ఆర్మీ పబ్లిక్ స్కూల్‌కు ఎక్సలెన్స్ అవార్డు

పర్లాకిమిడి/భువనేశ్వర్: సీబీఎస్‌ఈ బోర్డు- 2024 పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ రాణించినందుకు గోపాల్‌పూర్ ఆర్మీ స్కూల్‌కు ఎక్సలెన్స్ అవార్డు లభించింది. దీనిలో భాగంగా ప్రిన్సిపాల్ ప్రదీప్‌కుమార్ లక్ష రూపాయల నగదు, ట్రోఫీని లెఫ్టినెంట్ జనరల్ భవనీష్ కుమార్ చేతులమీదుగా నవంబరు 6న ఢిల్లీలో అందుకున్నారు. గంజాం జిల్లా గోపాల్‌పూర్‌లో ఆర్మీ పబ్లిక్ స్కూల్‌కు 27 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర ఉంది.గతంలో ఎంతోమంది విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని బహుమతులు గెలుచుకున్నారు. తాజాగా జాతీయ స్థాయిలో 141 ఆర్మీ పబ్లిక్ స్కూళ్లలో గోపాల్‌పూర్ ఆర్మీ పబ్లిక్ స్కూల్ చరిత్ర సృష్టించిందని ప్రిన్సిపాల్ ప్రదీప్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.



అవార్డుతో ప్రిన్సిపల్ ప్రదీప్‌కుమార్

పెళ్లి పేరుతో వంచించిన వ్యక్తి అరెస్టు



అరెస్టయిన రవికుమార్

రాయగడ: ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని ఓ వివాహితను నమ్మించి శారీరకంగా ఆ అతను దగ్గరయ్యాడు. తీరా పెళ్లి ప్రస్తావన తెచ్చేసరికి కాదుపొమ్మనాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే ప్రాణం తీస్తానని బెదిరించాడు. గత్యంతరం లేని ఆ వివాహిత పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసిన పోలీసులు వంచకుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. వివరాల్లోకి వెళితే.. రాయగడ జిల్లాలోని బిసంకటక్ సమితి చాటికొనలో నివాసముంటున్న వివాహిత తన భర్తతో తెగతెంపులు చేసుకుని వేరేగా తన 14 ఏళ్ల కూతురితో తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. ఆమెకు ఆంధ్రప్రదేశ్‌లోని మన్యం పార్వతీపురం జిల్లా భామిని మండలం చెందిన బత్తిలి పోలీస్ స్టేషన్ పరిధిలోని గురండి గ్రామానికి చెందిన రవికుమార్ కవూరొ అనే వ్యక్తితో పరిచయమైంది. ఈయన వ్యక్తిగత పనులపై చాటికొన వెళ్లి వస్తుండేవాడు. ఈ నేపథ్యంలోనే చాటికొనలో ఉంటున్న వివాహితతో సన్నిహితంగా ఉండి శారీరకంగా దగ్గరయ్యాడు. వివాహం చేసుకుని తన 14 ఏళ్ల కూతురితో మనమంతా కలసిమెలసి ఉందామని నమ్మించి తన అవసరాలను తీర్చుకున్నాడు. అయితే వీరిద్దరి శారీరక సంబంధంతో ఆమె గర్భం దాల్చింది. ఇప్పటికైన తనను పెళ్లి చేసుకోమని ప్రాధేయ పడింది. అందుకు ససేమిరా అంగీకరించని రవికుమార్ కొద్ది కాలంగా దూరంగా ఉంటుండేవాడు. ఫోన్‌లో మాట్లాడిన ఆమెతో తనకు ఎటువంటి సంబంధం లేదని ఈ విషయం ఎవరికైనా చెబితే ప్రాణాలు తీస్తానని బెదిరించాడు. దీంతో గత్యంతరం లేని ఆమె బిసంకటక్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు రవికుమార్‌ను గురువారం అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

గజపతి జిల్లాలో రూ.23 కోట్లతో కామధేను యోజన



ఆటోపై రాష్ట్ర మంత్రి గోకులనంద మల్లిక్, ఎమ్మెల్యేలు గొమాంగో, రూపేష్‌ల అభివాదం

పర్లాకిమిడి: ముఖ్యమంత్రి మోహన్ చరణ్‌మఝి గజపతి జిల్లాలో రూ.23 కోట్లతో పాడి రైతులను ప్రోత్సహించేందుకు కామధేను యోజనా పథకం ప్రవేశపెట్టనున్నారని రాష్ట్ర మత్స్య, ప్రాణిసంపద మంత్రి గోకులా నంద మల్లిక్ పర్లాకిమిడిలో తెలిపారు. ఆయన స్థానిక గజపతి స్టేడియంలో శుక్రవారం జిల్లా స్థాయి మత్స్య, ప్రాణిసంపద మేళాను ప్రారంభించారు. ఈ మేళాకు బరంపురం ఎంపీ ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి, మోహనా ఎమ్మెల్యే దాశరథి గోమాంగో, పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహిలు గౌరవ అతిథులుగా హాజరయ్యారు. స్టేడియంలో ఏర్పాటు చేసిన మేలుజాతి జెర్సీ గోవులు, సెంచూరియన్ వర్సిటీ ప్రాణిసంపద స్టాల్, వెటర్నరీ, మత్స్యశాఖ స్టాల్స్‌ను మంత్రి పరిశీలించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో రాష్ట్ర మంత్రి గోకుల నంద మల్లిక్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, పాడి రైతులకు 50 శాతం సబ్సిడీతో ఆటోలు, మోటార్ సైకిళ్లు, చేపల వలలు, చెరువులు తవ్వేందుకు నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. గజపతి జిల్లాలో చేపలు, గోసంపద వల్ల జిల్లా వ్యాప్తంగా పాల ఉత్పత్తి పెరిగిందని అన్నారు. పాడి, మత్స్యకారుల వల్ల గజపతి జిల్లా మున్ముందు మరింత అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. బరంపురం ఎంపీ ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి మాట్లాడుతూ, జిల్లాలో వలసలు అరికట్టాలంటే, ఉపాధి అవకాశాలు పెంచాలని అన్నారు. గ్రామీణ రైతులకు కోళ్లు, మత్స్య, పశుసంపద వల్ల స్వయం ఉపాధి పొందవచ్చని అన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ఈ జిల్లాను అభివృద్ధి చేయడానికి కాంగ్రెస్, బీజేడీ ఎమ్మెల్యేలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బహిరంగ సభలో మోహన ఎమ్మెల్యే దాశరథి గొమాంగో మాట్లాడుతూ, ప్రభుత్వం అన్ని రంగాల్లో రైతులపై భారం మోపుతున్న యూజర్ చార్జీలు ఎత్తివేయాలని దీనిపై వచ్చే అసెంబ్లీలో మంత్రి దృష్టికి తీసుకువస్తానని అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ బిజయ కుమార్ దాస్, జిల్లా ముఖ్య ప్రాణి చికిత్సా అధికారి డాక్టర్ తుషార్ రంజన్ సాహు, జిల్లా ముఖ్య మత్స్యశాఖ అధికారి లిసా బెహెరా తదితరులు పాల్గొన్నారు. జిల్లా స్థాయి మత్స్య, ప్రాణి సంపద మేళా పర్లాకిమిడిలో రెండు రోజుల పాటు జరుగనుంది.



పట్టుపురుగుల పెంపకం స్టాల్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర మంత్రి గోకుల నంద మల్లిక్, పక్కన ఎమ్మెల్యే దాశరథి గోమాంగో

విద్యార్థి ఆత్మహత్య



కున్నా జొడియా మృతదేహం

రాయగడ: ఆశ్రమ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన రాయగడ జిల్లాలోని కాసీపూర్ సమితి చంద్రగిరి సదరు పంచాయతీలోని ప్రభుత్వ మాధ్యమిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం చోటుచేసుకోగా.. కున్నా జొడియా (9) ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న ఎస్‌డీపీవో రశ్మీ రంజన్ సేనాపతి, సైంటిఫిక్ బృందం సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పడక గదిలోని మంచానికి తువ్వాలు సహాయంతో ఉరివేసుకున్నట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. కాసీపూర్ సమితిలోని ఖురిగా గ్రామానికి చెందిన ఖగేశ్వర్ జొడియా కొడుకుగా గుర్తించిన పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రేమ్‌పహడ్ లాటర్స్ క్లబ్ నూతన కార్యవర్గం



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

రాయగడ: ప్రేమ్‌పహడ్ లాటర్స్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం జరిగింది. ఉదయ్ పండా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా డాక్టర్ బాబూరావు మహంతి, కార్యదర్శిగా లాల్ బిహారి లెంక, సహ కార్యదర్శిగా హరిశ్చంద్ర సాబొరొ, జోలీవాకర్, కోశాధికారిగా వెంకటరమణ, ముఖ్య సలహాదారులుగా ఏపీపీ అభిమన్యు నాయక్, సత్యవాది పతి, టంకాల జయరాం, ప్రతాప్ చంద్ర బౌరి, ఎస్.సి.రథ్‌లు నియమితులయ్యారు. అనంతరంప భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.

రెవెన్యూ కాలనీలో.. ఆక్రమణల తొలగింపునకు చర్యలు



తొలగించనున్న గృహాలు

రాయగడ: స్థానిక పాత రెవెన్యూ కాలనీలోని ప్రభుత్వ క్వార్టర్లను ఆక్రమించుకుని ఉన్న వాటిని తొలగించేందుకు జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తుంది. కొద్ది రోజుల క్రితం జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి ఈ ప్రాంతంలో పర్యటించారు. కాలనీలో నిరుపయోగంగా ఉన్న క్వార్టర్ (గృహాలు)లను పరిశీలించారు. ఇక్కడ రెవెన్యూ సిబ్బంది ఉద్యోగ విరమణ తరువాత ఖాళీ చేసి వెళ్లిపోయిన తరువాత కొంతమంది ఆక్రమించుకొని నివసిస్తున్నట్లు గుర్తించిన కలెక్టర్ వారిని తొలగించేందుకు చర్యలు చేపట్టారు. తక్షణమే ఖాళీ చేయాలని ఆక్రమణదారులకు రెవెన్యూ శాఖ ఇప్పటికే నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలోనే శుక్రవారం తహసీల్దార్ ప్రియదర్శిని స్వయి కాలనీని సందర్శించి పరిశీలించారు. ఈ నెల 13వ తేదీన ఆక్రమణలను తొలగిస్తామని స్పష్టం చేశారు. ఆక్రమణదారులు స్వచ్ఛందంగా ఇళ్లను ఖాళీ చేయాలని సూచించారు. లేదంటే యంత్రాల సహాయంతో తొలగించేందుకు వెనుకాడమని స్పష్టం చేశారు. ఆక్రమణలను తొలగించిన అనంతరం ఈ స్థలాన్ని వైద్యశాఖ అవసరాలకు వినియోగించనున్నట్లు తెలిసింది.



కాలనీని పరిశీలిస్తున్న తహసీల్దార్ తదితరులు

13 నుంచి ఐటెప్ పరీక్షలు



ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ఐటెప్ (నాలుగేళ్ల సమీకృత డిగ్రీ కోర్సు) పరీక్షల షెడ్యూల్‌ను వర్సిటీ అధికారులు శుక్రవారం విడుదల చేశారు. ఈ నెల 13వ తేదీ నుంచి 19తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కోటబొమ్మాళి: రైలు నుంచి జారిపడిన ఘటనలో సుమారు 35 ఏళ్ల యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన హరిశ్చంద్రపురం రైల్వేస్టేషన్ సమీపంలో వెలుగు చూసిందని పలాస రైల్వే ఎస్సై ఎస్‌కే షరీఫ్ శుక్రవారం తెలిపారు. భువనేశ్వర్ నుంచి వచ్చే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నుంచి జారిపడి మృతి చెంది ఉండవచ్చునని చెప్పారు. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించామన్నారు. మృతుడి శరీరంపై నలుపు రంగుచొక్కా, నెక్ బనియాన్ ఉందన్నారు. మృతుని సమాచారం తెలిసిన వాళ్లు 94406 27567ను సంప్రదించాలని కోరారు.

జీతాలు, పింఛన్లు చెల్లించాలి

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు అక్టోబర్ నెల జీతాలు, పింఛన్లు ఇంకా రాలేదని జిల్లా గ్రంథాలయ సంస్థ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు తమిరి వైకుంఠరావు ఓ ప్రకటనలో తెలిపారు. పింఛన్‌దారుల ఆరోగ్య పరిస్థితులకు మందులు, ఇంటి అద్దె లు, రేషన్ కొనుగోలుకు, వైద్య ఖర్చులకు ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ఈ సమ స్యలు దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యద ర్శి, రాష్ట్ర ఆర్థిక శాఖాధికారికి స్పందించమని కోరుతూ లేఖలు పంపించినట్లు తెలిపారు. త్వరగా స్పందించాలని ఆయన కోరారు.

ధాన్యం సేకరణపై సమావేశం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా స్థాయి ధాన్యం సేకరణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది ధాన్యం కొనుగోలుకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్ సూచనలు చేశారు. ధాన్యం కొనుగోలు అనంతరం 24 గంటల నుంచి 72 గంటల్లోపు డబ్బులు జమ అవుతాయన్నారు. సమావేశంలో మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ సోమారి టాంగులు పాల్గొన్నారు.



సమావేశంలో వేదికపై అతిథులు



సమావేశంలో పాల్గొన్న అధికారులు

వైభవంగా కోటి దీపారాధనోత్సవం



మైదానంలో ఏర్పాటు చేసిన గోపురాలు, మందిరాల సెట్టు

- తరలివచ్చిన మహిళలు
- భక్తిశ్రద్ధలతో పూజలు



పూజా కార్యక్రమాలను నిర్వహిస్తూ..



ఆకట్టుకుంటున్న భారీ శివలింగం



కోలాట ప్రదర్శనలో వివిధ ప్రాంతాల మహిళా కళాకారులు



వంశధార నది నుంచి శుద్ధ జలాలను తీసుకువస్తున్న మహిళలు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో కార్తీక మాస పర్వదినాన్ని పురస్కరించుకుని బగువా మైదానంలో కోటి దీపారాధనోత్సవాలు శుక్రవారం ఉదయం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. దీంతో గుణుపూర్‌లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వంశధార నదీ తీరం నుంచి కలశాలతో శుద్ధ జలాలను ఊరేగింపుగా వేదిక స్థలానికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది మహిళలు భాగస్వాములయ్యారు. వీరంతా తీసుకువచ్చిన శుద్ధజలాలతో వేదికను సుద్ధి చేయడం ద్వారా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ముందుగా వేదిక వద్ద జైజగన్నాథ్ దీపరాధానతొ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం విఘ్నేశ్వర పూజలను నిర్వహించారు.

సహస్ర కోలాటం

దీపారాధనోత్సవాల్లో భాగంగా సహస్ర కోలాట కార్యక్రమం మైదానంలో జరిగింది. జిల్లాలోని గుణుపూర్, రాయగడ, అటు నవరంగపూర్, కొరాపుట్ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పార్వతీపురం, బొబ్బిలి, విజయనగరం, విశాఖపట్నం ప్రాంతాల నుంచి కోలాట బృందాలకు చెందిన 1108 మంది మహిళలు, చిన్నారులు కోలాటం ప్రదర్శనలో పాల్గొన్నారు. సుమారు గంట సమయంలో నిర్వహించిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. అనంతరం వండర్‌బుక్ ఆఫ్ రికార్డ్స్ (ఇంటర్‌నేషనల్)కు చెందిన ప్రతినిధుల బృందం కోలాటంలో పాల్గొన్న వారికి ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు.

ఆకట్టుకున్న సెట్లు

దీపారాధనోత్సవాల్లో భాగంగా మైదానంలో వివిధ రకాల సెట్లు ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా మందిరాల గొపురాలు, భారీ శివలింగం, పూజా మండపాలను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకోవడంతో పాటు విద్యుత్ దీపాలంకరణలు ప్రత్యేక ఆకర్షణంగా నిలిచాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 12వ తేదీతో ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

క్లుప్తంగా

విద్యుత్ చార్జీలు పెంచితే సహించం

● డీసీసీ అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్


ధర్నా చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

విజయనగరం ఫోర్ట్: ప్రజలపై విద్యుత్ చార్జీల భారం పెంచితే ఊరుకునేది లేదని డీసీసీ అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్ అన్నారు. ఈ మేరకు విద్యుత్ చార్జీలు పెంచడానికి నిరసిస్తూ విజయనగరంలోని వీటీ అగ్రహారం సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ట్రూ అప్ చార్జీల పేరుతో అదనపు భారాన్ని బడుగు, బలహీన వర్గాల ప్రజలపై మోపడం సరికాదన్నారు. నిత్యావసర వస్తువుల పెరగడం వల్ల ప్రజలు ఇప్పటికే ఇబ్బంది పడుతున్నారని, దానికి తోడు విద్యుత్‌చార్జీలు పెరిగితే మరింత ఇబ్బంది పడతారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గేదెల తిరుపతి, సతీష్‌కుమార్, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ఐదు గొర్రెల మృతి


మృతిచెందిన గొర్రెలను చూపిస్తున్న సూరిబాబు

వంగర: మండల పరిధి రుషింగి గ్రామంలో గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో ఐదు గొర్రెలు మృతిచెందాయి. గ్రామానికి చెందిన కూర్మాన సూరిబాబు తన గొర్రెల మందను గురువారం షెడ్డులో పెట్టగా అర్ధరాత్రి సమయంలో వాటిపై కుక్కలు దాడి చేశాయి. దీంతో మందలోని ఐదు గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేస్తున్నాడు.

షోకాజ్ నోటీసుపై విచారణ


విచారణ చేస్తున్న జెడ్పీ సీఈఓ సత్యనారాయణ

భోగాపురం: అమలులో ఉన్న ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను ఉల్లఘించి ఈనెల 6వ తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించిన ఎంపీడీఓ ఎం.కిశోర్‌కుమార్‌కు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ సేతుమాధవన్ బుధవారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. దీనిపై జెడ్పీ సీఈఓ బీవీ సత్యనారాయణ శుక్రవారం భోగాపురం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని షోకాజ్ నోటీస్‌పై సిబ్బందిని విచారణ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు షోకాజ్ నోటీసుపై విచారణ చేపట్టామని పూర్తి నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తామని తెలిపారు.

గంజాయి కేసులో ఆరుగురు యువకుల అరెస్ట్


ఆరుగురు యువకులను అరెస్టు చేసిన వన్‌టౌన్ పోలీసులు

విజయనగరం క్రైమ్: గంజాయి కేసులో ఆరుగురు యువకులను అరెస్టు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం, మన్యం జిల్లాకు చెందిన యువకులు ఒక ప్రాంతంలో చదువుతూ చెడు వ్యసనాలకు అలవాటు పడి, వారి అవసరాల కోసం ఒడిశా నుంచి గంజాయిని తీసుకువచ్చి, చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి, విక్రయిస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులకు వచ్చిన సమాచారంతో దాడులు చేశారన్నారు. ఈ మేరకు ఆరుగురు యువకులను అరెస్ట్ చేసి, వారి నుంచి రెండు కిలోల గంజాయిని వన్‌టౌన్ ఇన్చార్జ్ సీఐ ఎల్. అప్పలనాయుడు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారన్నారు. నిందితుల్లో చింతలవలసకు చెందిన కోరుకొండ కార్తీక్, గంట్యాడ మండలం కొత్తవెలగాడ గ్రామానికి చెందిన పి.కిరీటి, రొంగల ఆనంద్, జీఎల్.పురం మండలానికి చెందిన పురుషోత్తం జగదీష్, గాజులరేగకు చెందిన బెహరా దీపక్ పట్నాయక్, కామాక్షినగర్‌కు చెందిన పెనుమజ్జి లోకేష్ కుమార్‌లు ఉన్నారని తెలిపారు. నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹240

ఇలా అయితే కష్టం సార్..!

● తెర్లాం ఎస్సైపై తహసీల్దార్, ఎంపీడీఓలకు ఫిర్యాదు


ఎస్సైపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు

తెర్లాం: సాటి ప్రభుత్వ ఉద్యోగస్తులమని చూడకుండా ఎస్సై సాగర్‌బాబు అసభ్య పదజాలంతో దూషించి, కించపరిచే విధంగా మాట్లాడడంతో మనస్తాపానికి గురైన తెర్లాం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు ఎస్సైపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకుచ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగుల సంఘాల నాయకులు కె.ప్రసాద్, ఎ.సుధీర్, రామకృష్ణ, వెంకటనాయుడుతోపాటు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులంతా శుక్రవారం తహసీల్దార్, ఎంపీడీఓలను కలిసి ఇటువంటి సంఘటన పునరావృతం కాకుండా తమకు న్యాయం చేయాలని వినతిపత్రాలు అందజేశారు. నవంబరు నెలకు సంబంధించిన పెన్షన్ డబ్బులు తీసుకునేందుకు తామంతా స్థానిక స్టేట్ బ్యాంక్‌కు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో కలిసి వెళ్లామని, అక్కడికి వచ్చిన ఎస్సై తమతో దురుసుగా ప్రవర్తించారని, మీకు ఎవడ్రా ఉద్యోగాలిచ్చిందంటూ కించపరిచేలా మాట్లాడారని వారంతా ఆవేదన వ్యక్తంచేశారు. గత బుధవారం సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమావేశం పెట్టి పంచాయతీ కార్యదర్శులు ఏం చెప్పినా వినవద్దని ఎస్సై చెప్పారని, అక్కడ కూడా తమను అసభ్యపదజాలంతో దూషించారని వాపోయారు. ఇటువంటి సంఘటనలు జరిగితే తాము పెన్షన్ల పంపిణీ చేయలేని, ఇదే విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకువెళ్తామని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు స్పష్టం చేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్, ఎంపీడీఓలు అసలు ఏం జరిగిందో పరిశీలిస్తామని నచ్చచెప్పారు.

అజాగ్రత్తగా ఉందవద్దన్నాను

ఇదే విషయమై తెర్లాం ఎస్సై సాగర్‌బాబును వివరణ కోరగా పింఛన్ డబ్బులు బ్యాంక్ నుంచి తీసుకువెళ్లేటప్పుడు తప్పనిసరిగా వెల్ఫేర్ అసిస్టెంట్లతో పంచాయతీ కార్యదర్శులు ఉండాలని, అజాగ్రత్తగా ఉండవద్దని హితవు చెప్పానన్నారు. లక్షలాది రూపాయలను కొంతమంది ఉద్యోగులు కూరగాయల సంచుల్లో తీసుకువెళ్తుండగా చేసి అది తప్పని చెప్పానన్నారు. తాను ఏ ఉద్యోగిని కించపరిచి మాట్లాడలేదన్నారు. సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శుల సమావేశంలో కూడా విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని మాత్రమే చెప్పానని, పంచాయతీ కార్యదర్శులు చెప్పిన మాట వినవద్దని చెప్పాల్సిన అవసరం తనకు లేదన్నారు.

రాయితీ విత్తనాలు రైతులందరికీ అందించాలి

● వ్యవసాయశాఖ కమిషన్‌రేట్ జేడీ కృపాదాస్


రామవరం రైతు సేవా కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న జేడీ కృపాదాస్

గంట్యాడ: రాయితీపై అందిస్తున్న విత్తనాలు రైతులు అందరికీ అందించాలని వ్యవసాయశాఖ కమిషనరేట్ జాయింట్ డైరెక్టర్ కృపాదాస్ అన్నారు. ఈ మేరకు గంట్యాడ మండలంలోని రామవరం రైతు సేవా కేంద్రంలో శుక్రవారం ఆయన రాయితీపై అందిస్తున్న కట్టిజనుము, పెసర, మినుము విత్తనాల పంపిణీని పరిశీలించారు. అదేవిధంగా రైతు భరోసా కేంద్రంలో ఖరీఫ్ సీజన్‌లో అందించిన విత్తనాలు, ఎరువులకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కట్టి జనుమును విత్తనాలుగా సిద్ధం చేస్తే ఏపీ సీడ్స్ ద్వారా కొనుగోలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వి. తారకరామారావు, ఎ.డి అన్నపూర్ణ, ఏఓ శ్యామ్‌కుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

199 మద్యం బాటిల్స్ పట్టివేత

● 14 మందిపై కేసుల నమోదు


మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ డి.పద్మావతి

సీతానగరం: సీతానగరం సర్కిల్ పరిధిలో ఉన్నగ్రామాల్లో ఎక్సైజ్ శాఖ అధికారులు నిర్వహించిన వాహనాల తనిఖీ, బెల్ట్‌షాపుల నిర్వాహకులపై దాడుల్లో 199 మద్యం సీసాలను పట్టుబడగా 14 మంది నిందితులను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ డి.పద్మావతి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని వివిధ కూడళ్ల వద్ద మారువేషాల్లో ఉన్న తమ సిబ్బంది సోదాలు చేశారని చెప్పారు. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు సర్కిల్ పరిధిలో ఉన్న బలిజిపేట, సీతానగరం మండలాల్లోని కాశీపేట, నిడగల్లు, బక్కుపేట, చినభోగిలి, గెద్దలుప్పి, మరిపివలస, తుమరాడ, పెద్దింపేటగ్రామాల్లో సోదాలుచేసిన నేపథ్యంలో 14 మంది నిందితులు 199 మద్యం సీసాలతో పట్టుబడడంతో అదుపులోకి కేసులు నమోదు చేశామన్నారు. సోదాలు చేసిన వారిలో ఎస్సై ఎం.డి షరీఫ్, సిబ్బంది శేషగిరి,రావు, అనంతరావు, భూషణరావు, అప్పలకొండ, గౌరు పాల్గొన్నారు.

బానాదిలో 66 మద్యం సీసాలు

వేపాడ: మండలంలోని బానాది గ్రామంలో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో 66 మద్యం సీసాలు పట్టుబడినట్లు కొత్తవలస ఎక్సైజ్ సీఐ కె.ఇందిరాదేవి తెలిపారు. గ్రామానికి చెందిన వ్యక్తి వద్ద 66 మద్యం సీసాలు పట్టుబడడంతో వాటిని సీసాలు సీజ్ చేసిన నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. ఈ దాడుల్లో జి.రాజశేఖరనాయుడు ఇతర సిబ్బంది పాల్గొన్నట్లు చెప్పారు.

మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సిస్టం ఏర్పాటు

● 300 మొబైల్స్ ట్రేస్ చేసి బాధితులకు అందించిన ఎస్పీ


మొబైల్‌ఫోన్‌లను బాధితులకు అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: బాధితులు పోగొట్టుకున్న ఫోన్‌లను మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సిస్టం ద్వారా ట్రాక్ చేసి 300 మందికి వారి సెల్‌ఫోన్‌లను ఎస్పీ వకుల్ జిందాల్ తిరిగి అందజేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మొబైల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులు సైబర్ సెల్ కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదని, తమకు దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించి, మొబైల్ పోయినట్లు, మిస్ అయినట్లుగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. అదేవిధంగా మొబైల్ 8977945606 నంబర్‌కు మొబైల్ పోగొట్టుకున్న మెసెజ్ పంపిస్తే ఒక గూగుల్ ఫారం పంపిస్తామన్నారు. గూగుల్ షీట్‌లో పొందుపర్చిన వివరాలను మొబైల్ పోగొట్టుకున్న వ్యక్తులు పూర్తి చేసినట్లయితే, వాటిని ట్రేస్ చేసి, బాధితులకు తిరిగి అందజేస్తామని చెప్పారు. జిల్లాలో బాధితులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌లను ట్రాక్ చేసేందుకు ప్రత్యేకంగా మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సిస్టంను ఏర్పాటుచేశామని తెలిపారు. పోగొట్టుకున్న మొబైల్స్‌ను తక్కువ సమయంలో తిరిగి తమకు అప్పగించిన సైబర్ పోలీసులు, ఎస్పీకి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజినిగిరిలో యువకుడి హత్య

● రంగంలోకి దిగిన క్లూస్, డాగ్ స్క్వాడ్
● పోలీసుల అదుపులో అనుమానితుడు


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రవికుమార్, ఎస్సై జనార్దన్(ఇన్‌సెట్లో) హత్యకు గురైన అచ్చెంనాయుడు

జామి: మండలంలోని విజినిగిరి గ్రామంలో ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. ఈ ఘటనపై మృతుడి సోదరి ఫిర్యాదు మేరకు ఎస్సై వీరజనార్దన్ తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గనివాడ అచ్చెంనాయుడు(33) తల్లి అచ్చియ్యమ్మ మూగమనిషి. గ్రామంలో వారిద్దరే ఉండేవారు. అయితే రెండు నెలల క్రితం కూలిపనికోసం హైదారాబాద్ వెళ్లిన తల్లీకొడుకులు గురువారం స్వగ్రామం వచ్చారు. గ్రామంలో అందరితో కలిసి తిరిగాడు. శుక్రవారం ఉదయం ఉదయం గ్రామం సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద శవమై కనిపించాడు. ఈ విషయాన్ని స్థానికులు జామిలో ఉంటున్న మృతుడి అక్క కొండమ్మకు సమాచారం అందించారు. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై వీరజనార్దన్, సీఐ రవికుమార్ ఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించి గ్రామంలో విచారణ నిర్వహించారు. క్లూస్, టీమ్, డాగ్ స్క్వాడ్ రంగంలోకి దిగి ఆధారాలు సేకరించాయి. మృతదేహాన్ని ఎస్.కోట సీహెచ్‌సీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

హత్యేనంటూ పోలీసులకు ఫిర్యాదు

తన తమ్ముడిది హత్యేనని మృతుడి సోదరి శిరిపురపు కొండమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. గ్రామానికి చెందిన వి.సూరిబాబు, తన సోదరుడు అచ్చెంనాయుడు గురువారం మధ్యాహ్నం కలిసి తిరిగి ఇద్దరూ గొడవ పడ్డారని ఫిర్యాదులో పేర్కొంది. రెండు నెలల క్రితం తన తమ్ముడిని చంపేస్తానని సూరిబాబు బెదిరించాడని, ఆ భయంతో హైదరాబాద్ వెళ్లిపోయి కూలిపని చేసుకుంటున్నాడని తెలియజేసింది. తన తమ్ముడు గురువారం గ్రామానికి వచ్చి రాత్రికి మృతిచెందాడని ఇది సూరిబాబు పనేనంటూ ఫిర్యాదులో అనుమానం వ్యక్తం చేసింది.

పోలీసుల అదుపులో అనుమానితుడు:

ఈ కేసులో అనుమానితుడు సూరిబాబును పోలీసులు అదుపులోకి తీసుకోగా ఎస్సై వీరజనార్దన్ కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి సీఐ రవికుమార్ విచారణ సాగిస్తున్నారు.

ఐదు పశువుల వ్యాన్‌ల సీజ్


ఎస్ బూర్జవలసలో పట్టుకున్న పశువుల వ్యాన్‌లు

దత్తిరాజేరు: ఎలాంటి అనుమతులు లేకుండా పార్వతీపురం నుంచి పెదమానాపురం ప్రాంతానికి 45 పశువులను తరలిస్తున్న ఐదు వ్యాన్లను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్.బూర్జవలస, పెదమానాపురం ఎస్సైలు రాజేష్, జయంతి శుక్రవారం తెలిపారు. ఎస్ బూర్జవలస పోలీస్‌స్టేషన్ వద్ద ఆరు,11,10 పశువులతో వెళ్తున్న వ్యాన్లను ముందుగా అందించిన సమాచారం మేరకు పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. పెదమానాపురం వద్ద ఒక వ్యాన్‌లో 9.రెండో వ్యాన్‌లో 9 పశువులను పట్టుకుని వాహన యజమానులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో అపర్ణ సత్తా


బ్రాంజ్ మెడల్‌ను అందుకుంటున్న అపర్ణ

రాజాం: రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ రెజ్లింగ్ పోటీల్లో రాజాం మండలంలోని కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సత్తాచాటింది. ఈనెల 3 నుంచి 6 వరకూ విజయవాడలో జరిగిన స్కూల్‌గేమ్స్ అండర్ 14 బాలికల రాష్ట్ర స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని సామంతుల అపర్ణ బ్రాంజ్ మెడల్ విన్నర్‌గా నిలిచింది. ఆమెను ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం వీవీ వసంతరావుతో పాటు ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

తపాలా కార్యాలయాల్లో ఆధార్ అనుసంధానం

విజయనగరం టౌన్: జిల్లాలోని అన్ని తపాలా కార్యాలయాల్లో ఆధార్ అనుసంధాన ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదు నేరుగా అకౌంట్లలో జమయ్యేందుకు ఆధార్ సీడింగ్ తప్పనిసరన్నారు. డివిజన్ పరిధిలో సుమారు 1.30 లక్షల మంది ప్రజలకు ఎన్‌పీసీఐ మ్యాపింగ్‌లో ఆధార్ సీడింగ్ లేదన్నారు. ఐపీపీబీ అకౌంట్‌ను ఓపెన్ చేయడం ద్వారా ఆధార్ అనుసంధానించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని డివిజన్ పరిధిలో ఉన్న వారందరూ హెడ్‌పోస్టాఫీస్, 34 సబ్ పోస్టాఫీసులు, 308 బ్రాంచ్ పోస్టాఫీసుల్లో సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీతారామునిపేటలో నిత్యన్నదాన సత్రం


సత్రంలో పూజలు చేస్తున్న ఈసుబాబు, భక్తులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని నెల్లిమర్ల - రణస్థలం ప్రధాన రహదారిలో స్థానిక సీతారామునిపేట జంక్షన్ వద్ద నిత్యన్నదాన సత్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. సద్గురు సిద్దప్ప రాజయోగేంద్రుల వారి ఆశీస్సులతో ఆయన శిష్యుడు ఈశుబాబు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నూతన అన్నదాన సత్రంలో శుక్రవారం గోపూజ, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యం, మండపారాధన, వాస్తుహోమం, లక్ష్మీ గణపతి హోమం, రమా సత్యనారాయణస్వామి వ్రతం, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, కోలాటం ప్రదర్శనలు నిర్వహిచారు.

స్థల పరిశీలన

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీలో మురుగునీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటుకు తహసీల్దార్ సుదర్శనరావు, కమిషనర్ కె. అప్పలరాజు శుక్రవారం స్థల పరిశీలన చేపట్టారు. పట్టణంలోని విశ్వంభర పాఠశాలకు దగ్గరలో రైల్వే ట్రాక్‌కు ఆనుకుని ఉన్న ప్రైవేట్ స్థలాన్ని పరిశీలించారు. వారి వెంట టీపీఎస్ ఫిలిప్స్, మండల సర్వేయర్, వీఆర్వో, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

కన్నెధార కొండ పర్యాటకానికి ప్రతిపాదనలు


టూరిజంపై గిరిజనులతో మాట్లాడుతున్న ఐటీడీఏ సిబ్బంది

సీతంపేట: మండలంలోని పులిపుట్టి పంచాయతీ పరిధిలో గల కన్నెధారకొండ, ముక్కిడిపోలమ్మ గుడి ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దడానికి ప్రతిపాదనలు తయారవుతున్నాయి. ఈ ప్రాంతాన్ని టూరిజం స్పాట్‌గా తీర్చిదిద్దాలని పరిసరగ్రామాల ప్రజలు పలుమార్లు ప్రభుత్వానికి నివేదించారు. ఈ మేరకు కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు ఆదేశాలతో ఐటీడీఏ సిబ్బంది పలు గ్రామాలను సందర్శించి గిరిజనుల అభిప్రాయాలు సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా ఐటీడీఏ సిబ్బంది శుక్రవారం గిరిజనులతో సమావేశమై కన్నెధార కొండపై భూములు కలిగిన రైతులు గ్రామసభ తీర్మానం చేసి ఇవ్వాలని కోరారు. ఈనెల 12,13 తేదీల్లో పర్యాటక శాఖాధికారులు, ఐటీడీఏ సంయుక్తంగా సర్వే చేస్తాయని విలేకరులకు చెప్పారు. వ్యూపాయింట్, రోడ్లు, ట్రెక్కింగ్‌రూట్, రోప్‌వే వంటివి ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు సిబ్బంది వివరించారు.

మూడవ రోజు బౌలర్ల జోరు

● నేటితో ముగియనున్న రంజీ క్రికెట్ మ్యాచ్


ఆంధ్రా ఉత్తరాఖండ్ జట్ల మధ్య మ్యాచ్


బౌలింగ్ చేస్తున్న ఆంధ్రా ఆటగాడు

విజయనగరం: జిల్లా వేదికగా జరుగుతున్న ఆంధ్ర-ఉత్తరాఖండ్ జట్ల మధ్య రంజీ మ్యాచ్‌లో మూడవ రోజు బౌలర్‌లు జోరు కొనసాగించారు. ఇరు జట్ల బౌలర్‌లు ఆధిపత్యాన్ని ప్రదర్శించగా.. బ్యాట్స్‌మెన్ ఎక్కువ సమయంలో మైదానంలో నిలదొక్కుకోలేకపోయారు. దీంతో శుక్రవారం ఇరు జట్ల మధ్య హోరా..హోరీగా మ్యాచ్ సాగింది. 35.4ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి 92 పరుగుల ఓవర్ నైట్ స్కోరు మూడవ రోజు శుక్రవారం మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు 56.3 ఓవర్లలో 146 పరుగులకే ఆలౌట్ అయింది. అనంతరం రెండవ ఇన్నింగ్స్ బ్యాటింగ్‌ప్రారంభించిన ఉత్తరాఖండ్‌జట్టు 49 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 128 పరుగులు వద్ద డిక్లేర్ ప్రకటించింది. దీంతో 321 పరుగుల విజయలక్ష్యంతో రెండవ ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు మూడు రోజు ఆటముగిసే సమయానికి 4.1 ఓవర్లలో వికెట్ నష్టపోయి 8 పరుగులు జోడించింది. చివరి రోజు ఆంధ్రజట్టు 90 ఓవర్లలో 313 పరుగులు చేయాల్సి ఉంది. మొదటి ఇన్నింగ్స్‌లో ఉత్తరాఖండ్ జట్టు మొత్తం 135.2ఓవర్లలో 338 పరుగులకు ఆలౌటొంది.

"అమ్మను బాగా చూసుకో" సినిమా షూటింగ్ ప్రారంభం


సినిమా షూటింగ్‌లో పాల్గొన్న అతిథులు, కళాకారులు, దర్శకనిర్మాత భూషణం తదితరులు

వేపాడ: నాటకరంగంలో ఆసక్తి కనబరిచి పలువురి మన్ననలు పొంది సినిమా రంగంలో అడుగుపెడుతున్న సత్యసాయి భక్తుడు గొంప నాగభూషణం సినిమా రంగంలో సక్సెస్ కావాలంటూ పలువురు ఆకాంక్షించారు. వేపాడ మండలంలోని బానాది గ్రామానికి చెందిన గొంప నాగభూషణం సత్యసాయి భక్తుడు నాటకరంగంలో పలుమార్లు హీరోగా నటించిన అనుభవంతో సినిమా రంగంలో అడుగుపెట్టాలన్న ఆశతో ఆ వైపు అడుగులు వేశారు. ఈ నేపథ్యంలో కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం, నిర్మాత, హీరోగా నాగభూషణం సినిమా తీయడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం బానాది గ్రామంలో సినిమా షూటింగ్ ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్యసాయి గ్రామ సేవా రాష్ట్ర కన్వీనర్ సత్యనారాయణ, సత్యసాయి సేవాదళ్ జిల్లా కన్వీనర్ మహనోహార్ హాజరై మాట్లాడుతూ సినిమా రంగంలో అడుగుపెడుతున్న భూషణం సక్సెస్‌కావాలంటే కళాకారులు సహకారం అందించాలని కోరారు. దర్శక, నిర్మాత నాగభూషణం మాట్లాడుతూ బానాది పరిసర గ్రామాల్లో 40 మంది కళాకారులు, 40 మంది చిన్నారులతో సినిమా తీస్తున్నామని, ఈ సినిమాలో ముగ్గురు హీరోయిన్స్ ఉంటారని, తాను హీరోగా నటిస్తున్నానని తెలిపారు. సినిమాకి కో.డైరెక్టరుగా నగేష్, అసోసియేట్ డైరెక్టర్‌లుగా శ్రీను, ఎల్.కన్నబాబు కెమెరామెన్‌గా కె.మనోహార్ వ్యవహరిస్తారని తెలియజేశారు. కార్యక్రమంలో సినిమాలో నటించే కళాకారులు, అభిమానులు పాల్గొన్నారు.

ఏఎన్ఎం ఆత్మహత్యాయత్నం


భద్రగిరి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న ఏఎన్ఎం జ్యోతి

గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండలంలోని మొండెంఖల్లు సబ్‌సెంటర్‌లో ఏఎన్ఎంగా పనిచేస్తున్న జ్యోతి శుక్రవారం మధ్యాహ్నం మనస్తాపంతో సబ్‌సెంటర్ వద్ద మలేరియా మాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. ఈ విషయాన్ని గమనించిన సిబ్బంది జ్యోతిని మొండెంఖల్లు పీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక వైద్యసేవల అనంతరం మెరుగైన వైద్యం కోసం గుమ్మలక్ష్మీపురం మండలంలోని భద్రగిరి సీహెచ్‌సీకి తీసుకువెళ్లగా వైద్యసేవలు పొందుతోంది. ఏఎన్ఎం ఆత్మహత్యాయత్నానికి దారితీసిన కారణాలు తెలియాల్సి ఉంది.

రోడ్ల మరమ్మతులు వెంటనే ప్రారంభించాలి

● కలెక్టర్ డా.బీఆర్ అంబేడ్కర్


మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: గుంతలు లేని రహదారుల నిర్మాణంలో భాగంగా జిల్లాలో చేపడుతున్న 68 రహదారి మరమ్మతుల పనులన్నిటినీ సోమవారం లోగా ప్రారంభించాలని కలెక్టర్ డా.బి.ఆర్.అంబేడ్కర్ ఆదేశించారు. జిల్లాలో 932 కిలో మీటర్ల రహదారి మరమ్మతుల పనులను జనవరి నాటికి పూర్తి చేయవలసి ఉన్నందున వెంటనే ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆర్అండ్‌బీ అధికారులతో రహదారి మరమ్మతులపై ఆయన తన చాంబర్‌లో సమీక్షించారు. నియోజకవర్గం వారీగా మంజూరైన పనులను, ప్రారంభమైన పనులపై ఆరా తీశారు. 68 పనులకు గాను 3 పనులే ప్రారంభమయ్యాయని ఎస్.ఈ కాంతిమతి చెప్పగా సోమవారం నుంచి ప్రతిరోజూ సమీక్షిస్తానని, ప్రతిరోజూ పర్యటించి పనుల పురోగతిని స్వయంగా పరిశీలిస్తానని, అంతేకాకుండా పనుల నాణ్యతపై కూడా తనిఖీ చేస్తానని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతిరోజూ పనులు జరగాలని, సోమవారం అన్ని పనులను ప్రారంభించి ఆ రోజు సమీక్షకు ప్రారంభమైన పనుల ఫొటోలు కూడా తీసుకుని హాజరవాలని సూచించారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఈఈ, డీఈలు పాల్గొన్నారు.

కొత్త సహకార సంఘాల ఏర్పాటుకు చర్యలు


మాట్లాడుతున్న జేసి సేతు మాధవన్

విజయనగరం అర్బన్: మత్స్య, పశుసంవర్థక, సహకార శాఖలలో కొత్త సహకార సంఘాల ఏర్పాటుకు నవంబర్ 20 లోగా చర్యలు తీసుకోవాలని జేసీ సేతు మాధవన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తన చాంబర్‌లో ఆయా అధికారులతో సమావేశం నిర్వహించారు. సంఘాల ఏర్పాటుకు ఎటువంటి సంఘాలు లేని గ్రామాలను గుర్తించాలని సూచించారు. జిల్లాలో 100 సంఘాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా చేశామని, సొసైటీలు ఏర్పాటు చేసిన తర్వాత కమిటీ సభ్యులను నియమిస్తామని తెలిపారు. మార్చి 31 లోగా ప్రక్రియ పూర్తి చేసి నాబార్డ్ సహకారంతో శిక్షణలు, నిధులు తదితర ఏర్పాట్లను చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాబార్డ్ డీడీఎం నాగార్జున, మత్స్య, పశు సంవర్ధక శాఖల జేడీలు నిర్మలాకునారి, డా.వై.వి రమణ, డీసీసీబీ సీఈఓ ఉమామహేశ్వరరావు, డీసీఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోలో నుంచి జారిపడి వ్యక్తి మృతి


అప్పలనాయుడు మృతదేహం

గజపతినగరం: మండలంలోని ముచ్చర్ల, కెంగువ గ్రామాల మధ్య ఆటోలో ప్రయాణిస్తున్న వ్యక్తి జారిపడి మృతి చెందాడు. శుక్రవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. ముచ్చర్ల గ్రామానికి చెందిన గవర అప్పలనాయుడు(48)తో పాటు మరి కొంతమంది కూలీలు పని కోసం విజయనగరం బయల్దేరారు. మార్గమధ్యంలో ముచ్చర్ల క్వారీ సమీపంలో తువ్వాలు కింద పడబోతున్న సమయంలో దానిని అందుకోబోయిన అప్పలనాయుడు రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో వెంటనే క్షతగాత్రుడిని గజపతినగరం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. మృతుడికి భార్య వరహాలమ్మ, కుమారుడు ఈశ్వరరావు (ఒడిశాలో ఉద్యోగం), కుమార్తె ఉన్నారు. ఫిర్యాదు మేరకు ఎస్సై కె.లక్ష్మణరావు సంఘటనా స్థలంలో పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.